# మేడ్ ఇన్ హెవెన్?!

రచయిత లంటే ఎడ్మిరేషన్ మూర్తిగారికి. వయసు యాభై దగ్గర పడుతున్నా చిన్న వాళ్ళతో చెలిమి చేయడానికి ఆయన ఇష్టపడుతూ ఉంటారు. ఆయన రచయిత కావాలనుకున్న రోజులూ ఉన్నయ్. కాని కాగితం మీద ఇంకిపోయి బయటకు వచ్చి అక్షరరూపం దాల్చలేక పోయేవి ఏనాడూ! కృష్ణారావుకి ఆడవాళ్ళంటే ఏహ్య భావమన్న నమ్మకం చుట్టూ మనుషులలో ఘనీభవించడానికి కారణాలు చాలా ఉన్నా, ముఖ్యమైనవి రెండే. మొదటిది - అతను కేవలం బ్రహ్మచారిగా ఉండిపోవాలనే నిశ్చయం; రెండవది - అతని రచనలు. అర పేజీ చదవకముందు, ఆడవాళ్ళు ప్రస్తావన వస్తే అది కృష్ణారావ్ రచన అని పాఠకులు వెంటనే గ్రహించేస్తారు. ప్రతీ రచయితకీ విశిష్టమైన శైలో, ఉద్దేశాలో, అవగాహనో ఉండడం పరిపాటి. కృష్ణారావుని అతని చదువరులు 'మిసాజినిస్ట్' అని అంటారు. రంకు కథలూ, బూతుకబుర్లూ రాసి స్త్రీ జాతిని అవమాన పరుస్తున్నాడని అతనితో చదువుకుని, కాస్త చనువుగా తిరిగి దరమిలా జీవితంలో చక్కగా స్థిరపడిన 'ఆవిడ' లూ కూడ అతన్ని బాహ్యంగా అసహ్యించుకుంటూ, అతని రచనలు చదివే చాలా మందిలో కొందరు.

మూర్తిగారికి కష్ణారావ్ రచనల్లో ఒక విశిష్ట మైన 'కిక్' ఉన్నట్టు అతను చదివిన మొదటి కథలోనే స్ఫురించింది. రచయితకు కావలసిన అంతర్ దృష్టి, బాహ్య దృష్టి కూడా రావ్‌కి ఉన్నాయి. కాని పిల్లిగడ్డం పెంచడం, సమ్మేళనాల గురించి ప్రయత్నాలు చెయ్యడంలో, రచయితల గురించి అందరినీ తెలుసునని కబుర్లు చెప్పడంలాంటి లక్షణాలు మాత్రం అతనిలో గావు. పైగా ఎవరైనా అతని ఎదుట అతని రచనల్ని డిస్కస్ చేస్తే చాలా ఎంబరేసింగ్ ఫీలవుతాడు. ఇదీ మూర్తిగారు గమనించారు. సరళంగా మాట్లాడుతూ, ఇతరులను తెలివిగా పరిశీలిస్తూ, తనచుట్టూ ఉన్న మనుషుల్ని తన దగ్గరున్న వింత మీటరుతో కొలుస్తూ ఉంటాడు అని మూర్తిగారు తన భార్య కమలతో అతని గురించి అనడం పరిపాటి అయిపోయింది. అతని కథ అతనే రాస్తే చదవాలని మూర్తిగారికి కుతూహలం. అతను రాసే కథల్లోని సంగమ సన్నివేశాలూ, సెక్స్ సంభాషణలూ అతను కేవలం భావించే రాశాడని మూర్తిగారంటే అనవచ్చు కాని సగటు చదువరి మాత్రం అనడు. సగటు చదువరి దృష్టిలో అతని ఒక్కొక్క కథలోని ఆడపాత్ర అతనితో అనుభవాన్ని పంచుకున్నదనే నమ్మకమే కలిగింపజేస్తాడు కృష్ణారావ్.

మూర్తిగారంటే కృష్ణారావుకు ఎంతో ఇది. దానికి కారణం మూర్తి గారి అమ్మాయి మాధురేనని మూర్తిగారికి అడపా దడపా అనుమానం కలుగుతూండేది. మూర్తిగారు రాయమన్న కథ రావ్ రాయసనే సరికి ఆయనకి రావ్ మీద గౌరవం పెరిగింది. కృష్ణారావ్ రచనలు భావనా జనితాలనే నమ్మకం పెంచుకోవాల్సిన అవసరం గట్టిగానే ఏర్పడింది మూర్తిగారికి అడపా దడపా అనుమానం కలుగుతూండేది. ఒకవిధంగా ఆ నమ్మకం ఆయనకు మనశ్శాంతి నివ్వగలగడం ఒక వింత ఉదంతం.

మూర్తిగారు హైదరాబాదు బదిలీ మీద వచ్చిన కొత్త రోజులు. మాధురి ఆర్.బి.వి. ఆర్. కాలేజిలో బియ్యేలో చేరింది. ఆ ఆఫీసులోనే మూర్తిగారి స్థానంలో రావ్ అఫీషియేటింగ్ ఆఫీసర్ గా

చేస్తుండేవాడు. క్రమేణా మూర్తిగారు రావ్ గురించి చాలా తెలుసుకున్నారు. రావ్ తరచు తన రచనలను అయనకు చూపించడం, ఇద్దరూ అనేక కోణాల్లో వాటిని డిస్కస్ చెయ్యడం రివాజయి పోయింది. ఒకసారి ఒక అమ్మాయి వివాహానికి పూర్వం ఒక నవయువకునితో పరిచయం, దాని చిక్కదనం, తదనంతరం మరొకరితో పెళ్ళి, ఆ అమ్మాయి పాతివ్రత్యం వీటి చుట్టూ ఒకకథ అల్లి మూర్తిగారికి చూపించాడు రావ్.

"ఇది ఎవరినో దృష్టిలో పెట్టుకుని రాసింది కదూ!" మూర్తిగారు వెంటనే అడిగేశారు.

కృష్ణారావ్ వారింటికి తరచు రావడం ఎందుకా లేని ఆలోచనలో పడ్డారు మూర్తిగారు. ఆయన భార్య అందగత్తె కాదు. వయసు దాచుకునే స్వభావం కాని, అలాంటి ప్రయత్నం చేయడం కానీ కమలకి లేవు. కమల ఈడు పెళ్ళి కూతుళ్ళు ఈ రోజుల్లో ఉన్నారనుకోండి. అది వేరు. మరి ఇంకెందుకు వస్తున్నాడు రావ్? మూర్తిగారు తీవ్రంగా ఆలోచించారు. కమల కోసం కాకపోతే ఏదో కథలో తననే కాపీ చెయ్యడానికా? నాట్ లైక్లీ. రావ్ కథలకు సరిపోయే రకపు వ్యక్తిత్వం తనకు లేదే. ఆలోచించి ఆలోచించి ఒక రోజు స్నానం చేస్తూ ఆర్కిమెడీస్‌లా సడన్‌గా ఒక డిస్కవరీ చేశారు మూర్తిగారు.

కృష్ణారావ్ మాధురికోసం వస్తున్నాడు. అంటే మరిదేనికోసమో కాదు. ఎప్పుడూ రంకు కథలే రాస్తాడనే అపప్రథ ఉన్న రావ్ ఫర్ ఎ ఛేంజ్ అమాయకంగా ఉన్న కాలేజీ అమ్మాయి గురించి ఒక కాకరకాయో, నవలో ప్లాన్ చేస్తూ అక్క చెల్లెళ్లు లేని వాడవడం మూలాన కావలసిన అథెంటికేషన్ కోసం మాధురిని స్టడీ చెయ్యాలని వస్తున్నాడు. కమల పాతకాలపు మనిషి కాబట్టి వయసు నలభై మూడే అయినా మంచి సంబంధం చూడమనీ రావ్‌ని బోరుతూ ఉండేది. మాధురికి రావ్ ఈడైన వాడే అయినా, మాధురి ఏ మాత్రం జంకూ గొంకూ లేకుండా తల్లి పక్కనే కూచుని ఆ వయసులో ఆడపిల్ల లందరి లాగా సూర్యుడి కింది విషయాలన్నీ గంటల తరబడి హస్కు లాగించేస్తూ ఉండేది. ఇవన్నీ రైటర్స్ నోట్‌బుక్కు లాంటిది గట్టిది కుట్టి అందులో రావ్ ఎక్కించేస్తున్నాడన్న నమ్మకం ఒక తృటిలో మూర్తిగారికి వచ్చేసింది, ఆరోజు స్నానాల గదిలో.

ఆ నమ్మకాన్ని అనుమానం స్థాయికి దించి జాగ్రత్తగా రావ్‌ని స్టడీ చెయ్యడం ప్రారంభించారు.

కృష్ణారావ్ వయసు పాతికలోపు బీదవాడని వినికిడి. ఎమ్.ఏ. పాసయ్యాడు. గోముగా కోడల్ని తీసుకు రారా అనే తల్లీ లేదు. అతని సంపాదన కోసం ఆశించే తండ్రీ లేడు. అక్కలూ చెల్లెళ్ళూ అన్నలూ, తమ్ముళ్ళూ లేని రావ్ మంచి పెళ్ళి కొడుకుగా అందరి దృష్టిలోనూ మెదులుతూనే ఉన్నా, వాళ్ళ ఆఫీసు వరాన్వేషకులకి పెళ్ళివిషయంలో తనకి నిశ్చితమయిన అభిప్రాయా లున్నాయనీ, ఆ దృష్టితో తనవద్దకు రావద్దనీ చెప్పి అప్తులనిపించుకుంటున్న వాళ్ళకి దూరమై పోయాడు రావ్. రాను రాను తన గదీ, తన ఆఫీసూ, తన కలం, తన కాగితం ఇలా ఒంటరిగాడై పోయాడు. ఈ పరిస్థితులో మూర్తి గారు రావడం, ఆయనకి రావ్ అప్తుడవడం జరిగాయి. మాధురి కోసం మరో భావంతో భీష్మించుకున్న బ్రహ్మచారి. రెండవది కమల డబ్బుపిచ్చి. అమ్మాయికి ఎలాంటి వరుడు కావాలో అనేకసార్లు రావ్‌తో చెప్పడంవల్ల రావ్ మాధురి ఎంత అందని అందలమో తెలుసుకునే ఉంటాడు. ఇక మూర్తిగారికి రావ్ ఎలిజిబుల్ బాచిలర్ అన్న సంగతి గుర్తు ఉన్నా కమలకి అసలు ఆ సంబంధం నచ్చదని ఆవిడ ఆర్గ్యుమెంట్లన్నీ ముందే వూహించి ఆ ప్రపోజల్ చేయడమే విరమించుకున్నారు.

"అమ్మాయ్ ఇంకా రాలేదండీ, నాకేమిటోలా ఉంది" మూర్తిగారు క్లబ్ నుంచి వచ్చేసరికి అంది కమల.

"పోనీ నే వెళ్ళి కాలేజీలో చూసిరానా?" మూర్తి గారు కోటు విప్పుకుని వచ్చాక అడిగాడు కమలతో కబురు చెబుతున్న రావ్.

"పోనీ ఫోన్ చెయ్యరాదూ?" ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ వేశాడు మూర్తిగారు.

"ఎవరూ పలకడం లేదు." కమల తెంచేసింది.

"చూశారా, ఇన్నాళ్ళు నుంచీ చెబుతుంటే మీరు వినిపించుకోవడమే లేదు. మన రావ్‌గారి స్నేహితుడు ఢిల్లీలో ఎయిర్‌లైన్స్‌లో ఉన్నాడట. రెండువేలు పైచిలుకు జీతమట. కుర్రవాడు అందగాడట. వెంటనే వివరాలు తెలుసుకుని వాళ్ళవాళ్ళతో సంప్రదించండి."

కృష్ణారావ్ దగ్గర గ్రహించిన సమాచారం ఆధారంగా కృష్ణమూర్తిగారు వెంటనే పెద్దవాళ్ళకు ఉత్తరం రాశారు. మాధవ్‌రావ్ తల్లిదండ్రులు సనాతన ధర్మంలో నమ్మకమున్న వాళ్ళు. అబ్బాయి ఢిల్లీలో ఎమ్.ఏ చదివాడు. కృష్ణారావ్, మాధవరావ్ ప్రాణ స్నేహితులు. ఆరేసి నెలల కైనా ఒకసారి ఇద్దరూ కలవడం కద్దు. బియ్యే వరకు సహాధ్యాయులు. అమ్మాయి ఫోటో పల్లెటూరు వెళ్ళి అబ్బాయి తండ్రిని హైదరాబాదు రప్పించింది పెళ్ళి కుదిరిపోయింది.

"మేరేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్" కృష్ణారావ్ ఆనందంగా కాఫీ కప్పు కింద పెడుతూ అన్నాడు.

"థాంక్ యూ రావ్!" మూర్తిగారు ఆయన ఆనందాన్ని ఫార్ములా ప్రేజులో బహిర్గతం చేశారు.

"కళ్యాణం వచ్చినా, కక్కొచ్చినా ఆగదని ఆడవాళ్ల సూక్తి" రావ్ చమత్కరించబోయాడు.

కక్కొచ్చినా, డిక్కొచ్చినా ఆగదని క్లబ్ సూక్తి! దిస్ ఈజ్ ఫర్ యువర్ నోట్ బుక్! రచయిత ఏ పని చేసినా, ఎవరితో మాటాడినా కేవలం తన సరంజామా సేకరించడమేనని మూర్తి గారి నమ్మకం.

"మాధవరావ్‌ని గురించి మీ అభిప్రాయం?"

"నా స్నేహితుడు."

"నీ ఎనాలిసిస్?"

"స్నేహితులను ఎనలైజు చెయ్యడం......"

"రచయితకి ఆబ్జెక్టివిటీ ఉండాలి."

"పెళ్ళి కుదిరాక ఈ ప్రశ్న....."

"కుదిరింది కాబట్టే."

"ఎవరి గురించైనా కథ రాయాలనుకున్నప్పుడు వాళ్ళ గురించే ఆ కోణంలోకి ఆలోచిస్తా..... అందరినీ ఎనలైజు చేయాలంటే రోజుకి ఇరవై నాలుగు గంటలు చాలవ్. నేనెప్పుడూ ఏ స్నేహితుడ్నీ అందులో మాధవ్ గారిని విశ్లేషించలేదు. మీరడిగారు కాబట్టి ఆలోచిస్తే, ఒకరిని నొప్పించడమంటే బాధపడే మనిషి, స్నేహశీలి, డిపెండబుల్ ఫ్రెండు. ఎక్సలెంట్ మాన్"

మూర్తిగారికి మరేం ప్రశ్నలూ వెయ్యాలనిపించలేదు.

"ముహూర్తానికి వారంముందు నుంచీ నువ్వూ మా ఇంట్లో ఉండిపోవాలని మా కమల నీతో చెప్పమంది. నీ స్నేహితుడి గురించి నీకున్న అభిప్రాయం నీ ఎడల మా ఆవిడకీ ఉంది."

"అది మీ సహృదయం."

ఫైలు తీసుకుని వెళ్ళిపోయాడు కృష్ణారావ్.

దర్వాన్ గదిలోకొచ్చి ముసిముసి నవ్వులు నవ్వుతూ రావ్‌కి ఏదో చెప్పాడు.

"ఏమిటా నవ్వు. లోపలకు రమ్మను."

రావు తలెత్తి చూసేసరికి ఒక పంజాబీ యువతి గుర్రం గంతలేసి కళ్ళద్దాలు పెట్టుకుని సీలింగ్ వంక చూస్తోంది. దర్వాన్ కళ్ళు ఆమె వంకే చూస్తున్నట్టు తల ఎత్తీ ఎత్తగానే గమనించాడు రావ్.

"సారీ! వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ?"

"మాఫ్ కర్నా, ఒ ఆద్మీ....." ఆవిడ కొంచెం మొగమాటపడింది.

"జస్టు ఎ హార్మ్‌లెస్‌గై..... పోతయ్యా! రెండు డ్రింకులు తీసుకురా అబ్ బోలియే".

"పహలే ఏ దేఖియే." బాగ్ టప్ మని తెరిచి మేట్ పేపర్ మీద ప్రింటు చేసిన ఫొటో ఇచ్చింది రావ్‌కి.

కృష్ణారావ్ ఫొటో చూసి, ఒక క్షణం ఆ అమ్మాయి వంక చూసి కుర్చీలోకి జేరగిలబడ్డాడు. కాస్త తడబడుతూనే "ఐ డోన్ట్ అండర్‌స్టాండ్". అన్నాడు.

"ఏ దేఖియే" ఒక కాగితం అందించింది ఆవిడ. అది చూసిన తర్వాత మళ్ళీ బోధపడలేదు. అంటే ఆ అమ్మాయి ఏమంటుందో రావుకి తెలుసు. ఇతరుల చేత స్టుపిడ్ అనిపించుకోవలసిన అవసరం వెంటనే వచ్చేస్తున్నా ఈ అమ్మాయిచేత ఆ మాట అనిపించుకోడం ఇష్టం లేకపోయింది. తల దిమ్ముగా ఉంది. కడుపులో ఏదో తిప్పుతున్నట్టుంది.

"ఐ యామ్ సారీ!" ఇంకా నాన్ కమిటల్ గానే ఉండాలనుకున్నాడు రావ్.

"నేను మిసెస్ మాధవ్‌ని. నాలుగు నెలల క్రిందట మా పెళ్ళి రిజిస్ట్రార్ ఆఫీసులో జరిగింది ఢిల్లీలో. ఫొటో మీకు అర్థం కాకపోయినా...".ఆ అమ్మాయి ఇంగ్లీషు జల తరంగణి వాయిస్తున్నట్లు గణగణ లాడించేస్తోంది.

కృష్ణారావుకు తల తిరుగుతున్నట్లుంది. పోతయ్య డ్రింకులతో లోపల కొచ్చాడు.

"మీరు తీసుకోండి" ఆ అమ్మాయే రావుకు డ్రింకు అందించింది. చల్లని సీసా బుగ్గ దగ్గర పెట్టుకుని ఆలోచనలో పడ్డాడు రావ్. ఈ షాక్ తనకే తల తిప్పేస్తుంటే మరి మూర్తిగారికి , కమలగారికి, ఆ అమ్మాయికి....." గాడ్! ఐ హేవ్ బీన్ స్టుపిడ్....." బయటకే అనేశాడు.

"ఇక మీదనైనా, అబ్బాయిని ముందుగా అడగకుండా...."లిమ్కా పీల్చేసి లేచి నుంచుంది.

టేబిలు మీద సర్టిఫికెటూ, ఫొటో బాగులో వేసుకుంది.

"ఏమిటి సార్?" పోతయ్య పిలుపుతో కృష్ణారావ్ చేతిలోని నిండు సీసా చూసుకున్నాడు. "ఆవిడ ఎందుకు సార్, అంత వేగం వెళ్ళిపోతోంది?"

"ఆఫీసర్ దగ్గరకు వెళ్ళాలి" అంటూ డ్రింకు గటగటా తాగేశాడు రావ్.

"ఏమిటోయ్ అలా ఉన్నావ్? టేక్ యువర్ ఓన్ టైమ్......." జోక్ చేశాడు కుర్చీలో కూలబడ్డ **రావ్‌తో**, మూర్తిగారు.

"ఎలా చెప్పాలో...... మాధవ్ గాడికి పెళ్ళయి నాలుగు నెలలయిందట!"

"ఎవరా మాధవ్, ఏమా కథ?"

"జోక్ కాదు సర్! వాడి భార్య వచ్చి పెళ్ళి ఫోటో, సర్టిఫికెటూ చూపింది. ఐయామ్ సారీ!"

"నిజంగా?"

"మీతో హాస్యం ఆడతానా?"

"స్కౌండ్రల్!" టెలిఫోన్ తీశారు మూర్తిగారు.

పెళ్ళివారు పలానా ట్రెయిన్‌కు వస్తున్నట్లు మూర్తిగారికి టెలిగ్రామ్ వచ్చింది. హుందాగా రావ్‌కి పంపేశారది.

స్టేషన్‌లో మాధవ్ బండి దిగడం, ఏంరా ఇంత ఘోరం చేశావ్? అంటూ రావ్ అనడం - నేను పెళ్ళి కూతురు అన్నని అంటూ పోలీసాఫీసరు దుస్తుల్లో ఉన్నాయన ముందుకు వెళ్ళడం వెంట వెంటనే జరిగిపోయాయి.

"అమ్మా, నాన్నాగారూ......" మాధవ్ అటు పక్క చూపించాడు.

"ఏరా అబ్బాయ్! ఎదురు సన్నాహానికి ఎవరూ రాలా?" మాధవ్ తల్లి తెల్లబోయింది.

"అందుకేనమ్మా వచ్చింది మేము, పదండి. బయట కారుంది" పోలీసు ఆఫీసరందుకున్నాడు.

హోటల్ గదిలో కృష్ణారావ్ విభ్రాంతి తొలగించాడు మాధవ్. "నేను ఆ పంజాబీ అమ్మాయిని చేసుకున్నానన్న సంగతి అమ్మా వాళ్ళకీ తెలుసు. నీకు తెలియపరచక పోవటంవల్ల ఇంత కొంప మునిగింది. మనమాటా, మనకట్టూ మన బొట్టూ కాని అమ్మాయిని చేసుకున్నందుకు ఇంట్లో పెద్ద వాళ్ళంతా గంతులేస్తూ, కొన్ని రోజులు పోయాక, గుట్టు చప్పుడు కాకుండా, మన ప్రాంతం పిల్లని కట్టేస్తే నేను ఆ పంజాబీని వదిలేస్తానని వాళ్ళ నమ్మకం. ఆఖరి క్షణం వరకూ నువ్వు చూసిన సంబంధం ఇదన్న సంగతి నాకు వాళ్ళు తెలియ చెయ్యలేదు - నువ్ నన్ను క్షమించక పోయినా ఫరవాలేదు కాని, ముందు ఆ అమ్మాయి తల్లి దండ్రుల దగ్గరకు వెళ్ళి క్షమాపణ చెప్పుకోవాలి. వాళ్ళకు దీనివల్ల అయిన ఖర్చు....."

"వండర్‌ఫుల్! అంటే మీరు డబ్బు ఇచ్చేస్తే సరి పోతుందా....మరి ఆ అమ్మాయి భవిష్యత్తు!"

"క్షమించండి ఇన్‌స్పెక్టర్‌గారూ! ఇది నేను కోరి చేసిన తప్పు కాదు. నా తల్లిదండ్రులను నేను ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాని నమ్మింప చెయ్యాలి. ఆమెను నేను వదిలెయ్యనన్న కనువిప్పు కలుగ చెయ్యాలి. దానికి ఇంతకంటే మరో మార్గం కనపడలేదు. పెళ్ళి నిశ్చయం చేసి నాకు రాశారు. నేను వచ్చి వాళ్ళను సంజాయిషి ఇచ్చుకున్నట్లయితే ఇలాగే మరో అమ్మాయితో ఖాయం చేసే వాళ్ళందరినీ ఇబ్బంది పెట్టే ప్రమాదం తప్పవచ్చు. నేను కేవలం రాకుండా ఉండడం వల్ల ఈ సమస్య పరిష్కారం కాదు - నేను ఇలా రావడం వల్ల ఒక్క మూర్తిగారే ఈ బాధకి గురయ్యారు..... ఏరా వెళ్ళి పోతున్నావ్....."

- కృష్ణారావ్ గబగబా హోటల్ మెట్లు దిగి టాక్సీ ఎక్కేశాడు.

- "క్షమించాలి నావల్ల - కేవలం నావల్లే కాదనుకోండి, మాధవ్‌గాడి తల్లిదండ్రులవల్ల మీ అమ్మాయికి అన్యాయం జరిగింది. మీ వంశ ప్రతిష్ఠ......." మూర్తిగారితో ఆవేశంగా చెప్పేస్తున్నాడు రావ్.

"పిల్లీ! దోవలో నడుస్తుండగా ఏదో గుచ్చుకుంటుంది. అంత మాత్రాన మన ప్రతిష్ఠ పోతుందా?" కమలమ్మగారు అందుకుంది.

"ముల్లు గుచ్చుకుంటే నొప్పెడుతుంది. కాని దీనివల్ల నాకు నొప్పి కూడా కలగడం లేదు?" మూర్తిగారన్నారు.

"ఆ అమ్మాయి.......". ఎలా వోదార్చాలో తెలియక తికమకపడుతున్నాడు రావ్.

"భగ్న ప్రేమికురాలై, గుండెలు బద్దలై" చచ్చిపోక పోతే ప్రతిష్ఠకు భంగం అయిపోతుందా? మాధురి దడదడా మాటాడుతుంటే భార్య భర్త లిద్దరూ లోపలకు జారుకున్నారు.

"నువ్వు అడగడమే న్యాయం నీ దగ్గరే నా దగ్గరకంటే రావ్‌కి చనువు. నీ ఆస్తి పిచ్చి వల్ల నేను జంకాను. లేకపోతే ఏనాడో అడుగుదును. ఇప్పుడడిగితే ఏమనుకుంటాడు?"

"డబ్బున్న సంబంధం చూశాం ఇలా అయిందిగా. కానీ నే నడగడం సమంజసం కాదు. అది మగాళ్ళ పని...."

వాళ్ళల్లో వాళ్లకి సయోధ్య, కుదిరి వాళ్ళు బయటకు వచ్చేసరికి.

"మాధురీ! ఐ లవ్ యూ!" అంటున్నాడు మాధురి చేతులు పట్టుకుని, భీష్మించుకున్న బ్రహ్మచారి కృష్ణారావ్.

ఆంధ్రప్రభ,
24.10.79